# జీవజ్వాల

మేఘాలు పెనుబొబ్బలు పెడుతూ ఉరుముతున్నాయి. విపరీతమైన ఉక్క. ఆకు అల్లల్లాడడం లేదు.

నిస్త్రాణగా పడక కుర్చీలో పడుకుంది స్వరాజ్యం. లేస్తే కళ్ళు తిరిగి పోతున్నాయి. గుండె దడదడ లాడిపోతూంది. బయటకు వెళ్ళి ఉద్యోగాలు చేసుకుంటున్న పిల్లలు తన అనారోగ్యం వల్ల ఇంటి పనులు కూడా చెయ్యాల్సి వస్తూందే అని బాధ పడుతూంది.

"అమ్మా! పనులన్నీ దాదాపుగా అయిపోయాయి. యింకేమైనా వుంటే సాయంత్రం వచ్చాక చేసుకుంటాము. నువ్వు రెస్ట్ తీసుకో. నాన్న వస్తే లేచి హైరానా పడిపోకు. అయనే పెట్టుకుని తింటార్లే." నిస్తేజంగా చూస్తున్న తల్లి వంక ఒక క్షణం నిశితంగా చూచి ఆమెను పొదవి పట్టుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకుంది స్వరాజ్యం రెండో కూతురు గీత. అంతలో టిఫిన్ బాక్స్‌ని బేగ్‌లో పెట్టుకుంటూ సుడిగాలిలా బయటకు వచ్చింది స్వరాజ్యం మూడో కూతురు సుధ.

"కమాన్!కమాన్! నా బస్సుకు టైమయిపోయింది." పరుగు లాంటి నడకతో వీధి లోకి వెళ్ళింది సుధ.

"నువ్వలా దిగులుగా వుంటే మేము చూడలేమమ్మా! ఎంత పాలిపోయావో తెలుసా? నువ్వు కూడా లేకపోతే మేమెలా బ్రతుకుతాం చెప్పు." దుఃఖంతో ఒణికింది గీత కంఠం. అంతలోనే సంబాళించుకుని సుధననుసరించింది.

"నువ్వు కూడా లేకపోతే మేమెలా బ్రతుకుతాం చెప్పు" బేలగా అడుగుతున్న కూతురి ముఖం పదేపదే కళ్ళ ముందు నిలుస్తూంటే స్వరాజ్యం గుండె లోతుల్లోంచి దుఃఖం కెరళ్లు కెరళ్లుగా విరిగి పడుతూంది. తను లేక పోవడమనేది అతిత్వరలోనే జరుగుతుందని నిన్న లేడీ డాక్టర్ చూచాయగా చెప్పింది.

తన జీవితంలో ఏ ఒక్క సంఘటన తన అధీనంలో వుండి జరగలేదు. ఇంక అంతిమ ఘట్టం కూడా అలాగే జరుగుతుంది. అసలు తనలాంటివాళ్ళు పుట్టడమే భూమికి భారం. తను పుట్టి ఏం సాధించింది? తను బ్రతకడం వల్ల ప్రపంచానికేం ప్రయోజనం ఒనగూడిందని? తను లేకపోవడం వల్ల లోకానికేం లోటు జరుగుతుంది? విపరీతమైన దిగులు, నిస్పృహ చుట్టేశాయి స్వరాజ్యాన్ని.

దేశంలోని ప్రతి వ్యక్తి స్వరాజ్యం కోసం కలవరించి, పలవరించే రోజుల్లో స్వరాజ్యం పుట్టింది. కుటుంబంలో నాలుగో కూతురుగా పుట్టిన స్వరాజ్యన్ని చూచి కుటుంబ సభ్యులంతా విచారించారే తప్ప ఏ ముచ్చట్లు, వేడుకలు జరపలేదు.

జీవితం మీద ఎన్నో ఆశలు, భవిష్యత్తును గురించి ఎన్నో సుందర స్వప్నాలు, స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా అంది సమభావం, సౌభ్రాత్రం, సుహృద్భావం ఎల్లెడలా వెల్లి విరుస్తాయనే ఉత్సాహం, ఉత్తేజం, ప్రతివారి

హృదయంలో పరవళ్లు తొక్కుతున్న వాతావరణంలో స్వరాజ్యం బాల్యం గడిచింది. పంచవర్ష ప్రణాళికలు, పంచాయితీ రాజ్, కర్మాగారాలు, ఆనకట్టలు, పల్లె పల్లెకు విద్యుచ్ఛక్తి , పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రగతికిరణాలు ప్రజ్వలిస్తూ క్రొత్త ప్రపంచానికి ద్వారాలు తెరుచుకుంటూండగా స్వరాజ్యం ఎలిమెంటరీ స్కూలు చదువు పూర్తయింది.

ఊళ్ళో వున్న మిడిల్ స్కూల్ని హైస్కూలుగా మార్చారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లోని విద్యార్థినీ విద్యార్థులంతా రోజుకు ఏడెనిమిది మైళ్ళ దాకా నడిచి తమ ఊరి హైస్కూల్‌కి వచ్చి చదువుకుంటూంటే స్వరాజ్యం మాత్రం ఏడవ తరగతితో చదువు చాలించాల్సి వచ్చింది. దానికి కారణం స్వరాజ్యం నాయనమ్మ భగవతమ్మ.

ఏభై ఎకరాల మాగాణి, మండువా లోగిలి, పాడి, పంట సమృద్ధిగా వున్న నలుగురన్నదమ్ముల ఉమ్మడి కుటుంబం తల్లి భాగవతమ్మ మాట మీదుగా నడిచేది. వైష్ణవ మతం పుచ్చుకుని, చక్రాంకితాలు వేయించుకుని, మడిగా వండుకుని, శాకాహారాన్ని మాత్రమే తింటూ, రైతు కుటుంబమే అయినా ఆచార వ్యవహారాల్లో, పూజాపునస్కారాల్లో బ్రాహ్మణుల్ని అనుకరించేవారు. ఆడపిల్లల్ని కట్టుదిట్టాలలో పెంచడం, అత్యవసరమయితేతప్ప వయసు వచ్చిన ఆడపిల్లల్ని గడపదాటనివ్వకపోవడం, వ్యక్తురాలవగానే పెళ్ళి చేసేయడం రివాజుగా ఉండేది. ఘోషా పాటించడాన్ని గొప్పగా భావించేవారు.

మిధ్యా భావాలతో స్వరాజ్యాన్ని చదివించకుండా ఇంట్లో కూర్చో బెట్టడాన్ని సహించలేని స్వరాజ్యం చిన్నాన్న కొడుకు రఘు ఆమెను చదివించమని పెదనాన్నతో పోరు పెట్టాడు.

"యిది అన్యాయం పెదనాన్నా! వరసగా డింకీలు కొడుతున్న కేశవ్‌ను, రాఘవను చదివిస్తున్న మీరు ప్రతి క్లాసులో ఫస్టున వచ్చే స్వరాజ్యాన్ని చదువాపించి ఇంట్లో కూర్చోబెట్టడం ఏమైనా న్యాయంగా వుందా? స్వరాజ్యానికి అమోఘమైన తెలివితేటలున్నాయి ఇలా అర్ధాంతరంగా చదువాపేసి దాని తెలివిని చంపేయకండి. నాయనమ్మ దాని పెళ్ళి ప్రయత్నాలు చేస్తూంది. పసిదానికి అప్పుడే పెళ్ళేమిటి?" పదమూడేళ్ళు నిండని స్వరాజ్యానికి పెళ్ళి అనే ఊహనే భరించ లేకపోతున్నాడు రఘు. కాలేజీ చదువుకు క్రిందటి సంవత్సరమే పట్నం వెళ్ళిన రఘు కొత్త భావాల వెల్లువలో కొట్టుకుపోతున్నాడు. ఆ భావాలిచ్చిన ధైర్యంతోనే పెదనాన్న ఎదుట

పడి వాదిస్తున్నాడు.

"ఇంట్లో కూర్చునే నాయనమ్మకు ప్రపంచమెంత వేగంగా మారిపోతూందో ఏం తెలుస్తుంది పెదనాన్నా? ఆవిడ చాదస్తానికి స్వరాజ్యం భవిష్యత్తు బలయిపోవాల్సిందేనా?"

"ఆడదానికింకెందుకులేరా చదువు" విసుగ్గా అన్నాడు స్వరాజ్యం తండ్రి వెంకటేశ్వరరావు.

"అలా అంటావేమిటి పెదనాన్నా? ఆడపిల్లలు చదువుకోవడం తక్షణ అవసరం, అది వాళ్ళ కోసమే కాదు మొత్తం దేశం కోసం, జాతి జాగృతి కోసం" ఉద్వేగంగా అన్నాడు రఘు.

"ఆఁ! చదువుకుని దేశాన్ని ఉద్ధరిస్తారా వీళ్ళు?!"వ్యంగ్యంగా అన్నాడు వెంకటేశ్వర్రావు.

"అవును. వాళ్ళే దేశాన్ని ఉద్ధరించగలిగేది. ఈ దేశం బాగుపడాలంటే ముందుగా కావలసింది కుప్పలు తెప్పలుగా పిల్లల్ని కనకుండా వుండడం. ఆడపిల్లలు చదువుకుంటే తప్ప ఎక్కువమంది పిల్లల్ని కనడం వల్ల కలిగే అనర్ధాలు అర్ధంకావు. జనాభా రాకెట్ వేగంతో పెరగడం వల్ల దేశప్రగతి ఎలా కుంటుపడుతూందో గుర్తించలేరు. ఆడపిల్లలు చదువుకుంటే తప్ప గవర్న మెంట్ చేపట్టే పామిలీ ప్లానింగ్ పథకాలేవీ సక్సెస్ కావు." ఆవేశంతో రఘు ముఖం కందింది.

" ఏమిటోరా! నీ ఉపన్యాసాలూ, నువ్వూనూ! ఉత్తరం ముక్క రాయడానికి, చాకలి పద్దేయ్యడానికి ఇప్పుడది చదివిన చదువు చాలు. ఇంట్లో కూర్చుని వంట,పిల్లల్ని చక్కబెట్టుకుంటాని కింకెందుకురా పై చదువులు?" తన మాటల్ని 'ఉపన్యాసాలు' అంటూ హేళనగా కొట్టేయడాన్ని సహించలేకపోతున్నాడు రఘు.

"మీ అభిప్రాయం చాలా తప్పు పెదనాన్నా! ఒక ఆడపిల్లని చదివిస్తే మొత్తం కుటుంబం విజ్ఞానవంతమౌతుంది. సమాజంలో సగభాగంగా వున్న ఆడపిల్లలు కేవలం వంటింటికి, పిల్లల పెంపకానికి పరిమితమై సమాజ అభివృద్ధిలో మగవాళ్ళతో సమానంగా పాలు పంచుకోకపోతే దేశం వెనక్కు నడుస్తుంది."

'భలే విడ్డూరపు కబుర్లు చెప్తున్నావురా రఘూ! ఆడది వంట చెయ్యకుండా ఉద్యోగాల కెగబడితే సంసారమెట్లా నడుస్తుంది? ఐనా ఆడపిల్ల సంపాదించి తెస్తే కూర్చుని తినే గతేం పట్టలేదు మనకు."

"ఆడవాళ్ళ చదువు, ఉద్యోగం గురించి అంత చులకన పనికి రాదు. ఐనా మనకేం ఎస్టేటులున్నాయని విర్రవీగిపోవడానికి? మనకున్న ఏభై ఎకరాల్ని మీ అన్నదమ్ములు నలుగురు కన్న ఇరవైమందిమి పంచుకుతింటే ఒక్కొక్కరికి ఎంత వస్తుంది?" రఘు మాటలు వితండవాదంగా కనిపించింది వెంకటేశ్వర్రావుకి.

"నువ్వు చిన్నాడివి. నీకు చెప్పినా అర్థంకాదురా అబ్బాయి. ఐనా... అమ్మ ఒప్పుకోదు." పై పంచ దులిపి భుజానేసుకుని బయటకు వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడయాడు వెంకటేశ్వరరావు.

"అర్థం కానిది నాకు కాదు, మీ అందరికి. కళ్ళుండి కూడా ప్రపంచం నడకను చూడలేని గుడ్డివాళ్ళు. బాగా చదువుకుని రాణించాల్సిన స్వరాజ్యం తెలివి తేటల్ని, టాలెంట్స్‌ని మీ మూర్ఖత్వంతో సమాధి చేస్తున్నారు... పెదనాన్నా! నువ్వు నాయనమ్మకు నచ్చ చెప్పు. లేకపోతే ఆవిడకూ నాకు పెద్ద యుద్ధమే జరిగి తీరుతుంది." హెచ్చరించాడు రఘు.

ఎంత యుద్ధం చేసీ రఘు స్వరాజ్యం పెళ్ళిని ఆపలేకపోయాడు. భగవతమ్మ గుండె నొప్పి వచ్చిందని ఆపసోపాలు పడుతూ మనవరాలి పెళ్ళి చూచి చనిపోతానని హడావిడి చేసింది. ఈ అస్త్రం బాగా పనిచేసి ఇంటిల్లపాది రఘుని ఏకాకిని చేసి మందలించారు.

తలకు మించిన భారమయినా సర్వలాంఛనాలతో స్వరాజ్యాన్ని అత్తవారింటికి పంపారు. పెళ్ళిలోనే అల్లుడి అవలక్షణాలు బయటపడ్డాయి. చీటికి మాటికి కోపగించుకోవడం, అలగడం, విపరీతమైన అహంకారంతో అనాగరికంగా అరవడం, రాత్రింబవళ్లు పేకాడుతూ కూర్చోవడం, తన సుఖం, సంతోషం తప్ప ఇతరులెవరినీ పట్టించుకోని స్వార్థం... గుర్తుంచుకోదగిన మధుర స్మృతులేమీ లేకపోగా పెళ్ళి, కొత్త కాపురం చేదు అనుభవాల్ని మిగిల్చింది స్వరాజ్యానికి. ఆ అరుపులకు, కోపానికి బిక్క చచ్చిపోయి ఒదిగి ఒదిగి ఎక్కడోచోట దాక్కోవడానికి ప్రయత్నించేది. ఉదయం లేచిన దగ్గర్నుండి రాత్రి పడుకోబోయే వరకు అతని సుఖాలకు అన్నీ అమర్చి పెడుతున్నా కూడా తిట్లు తప్పేవికావు.

క్రమేపీ ఆమెలోని సున్నితమైన భావాలన్నీ కాలిపోయి జీవితం పట్ల భయం, బెరుకు ప్రారంభమయాయి. తనకు లభించిన మోటు బ్రతుక్కు అలవాటు పడుతూ వుండగానే సంవత్సరానికో కానుపు చొప్పున ఎనిమిదిమంది పిల్లలు పుట్టారు. నాలుగు గర్భస్రావాలయాయి. ఆమె మనసు, శరీరమూ కూడా బాల్యంనుండి

అతివేగంగా వృద్ధాప్యానికి చేరుకున్నాయి. విపరీతమైన నిస్త్రాణ, అలసట, విసుగు. అతి చిన్న విషయాలకే ఏడవడం, హిస్టీరికల్‌గా ప్రవర్తించడం నిత్యకృత్యాలయాయి. బాధ్యతలేని తండ్రి, జీవితంలో విపరీతంగా అలిసిపోయిన రోగిష్టి తల్లి సంరక్షణలో ఎనిమిది మంది సంతానం గాలివాటుకు పెరుగుతున్నారు. అర్థాకలితో, ఎటూ తీరని అవసరాలతో అల్లాడుతున్న బిడ్డల్ని చూస్తూంటే స్వరాజ్యానికి భవిష్యత్తు అగమ్యగోచరంగా వుంది.

ఉద్యోగ రీత్యా ఉత్తర భారతదేశంలోవుంటున్న రఘు చెల్లెల్ని చూడడాని కొచ్చాడొక రోజు. ఇంట్లో అడుగు పెట్టిన కొద్దిసేపటికి చెల్లెలెంత దీనంగా కుటుంబాన్ని నడుపు కొస్తూందో అర్థమయి దిగులుగా కూర్చున్నాడు. రాకరాక వచ్చిన అన్నగారిని చూడగానే చిన్ని సంతోషపుటల స్వరాజ్యన్ని చుట్టేసింది. గబగబా ఇంట్లో వున్న కాస్త గోధుమ రవ్వతో ఉప్మా చేసింది. దానివంక ఆశగా నోళ్ళు తెరుచుకుని చూస్తున్న పిల్లల్ని తిట్టి బయటికి పంపేసి ఉప్మా ప్లేట్‌ని, మంచినీళ్ళ గ్లాసుని తీసుకుని అన్నగారి దగ్గరకు వచ్చింది.

" తినన్నయ్యా!" చెల్లెలి ఆప్యాయతకు రఘు కళ్ళల్లో చివ్వున నీళ్ళుబికాయి.

"ఇప్పుడెందుకమ్మా హైరాన పడుతూ చేసావు?" చెల్లెలి చేతి నందుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకుంటూ అన్నాడు రఘు.

"హైరానేముందన్నయ్యా? ప్రొద్దున ఎప్పుడుతిని బయల్దేరావో ఏమిటో! ముఖం ఎలా వాడిపోయిందో చూడు" బాధగా అంది స్వరాజ్యం.

"బావున్నావామ్మా?" సెగతగలిన వెన్నలా అవుతూంది స్వరాజ్యం. సమాధానం చెప్పకుండా మౌనంగా తలూపింది.

"చలపతి ఏడమ్మా? పొలానికి వెళ్ళాడా?" భర్త ప్రసక్తి రాగానే స్వరాజ్యంలో అన్నగారిని చూచిన సంతోషం హరించుకుపోయింది.

"నీకు తెలీనిదేముందన్నయ్యా? ఎప్పుడోగాని ఆయన పొలమెళ్ళరు. గుళ్ళో మండపంలో చేరి పోచుకోలు కబుర్లు చెప్తూ పేకాడుతూ వుండుటారు. వాళ్ళనీ వీళ్లనీ బ్రతిమాలి నేను చేయించుకోవడమే పనులన్నీ." కళ్ళుదించుకుని భూమిలోకి క్రుంగిపోతున్నట్లుగా కూర్చుంది స్వరాజ్యం. రఘు నోట్లో పెట్టుకున్న ఉప్మా గొంతు దిగడం లేదు. ధారాపాతంగా కారుతున్న కన్నీటిని పయట చెంగుతో తుడుచుకుంది స్వరాజ్యం.

"నా నుదుట ఇట్లా బ్రతకాలని రాసివుంటే ఇంకోలా ఎలా జరుగుతుంది? నువ్వు నాకోసం అంత పోరాడినాకూడా చదువుకుంటానని, అప్పుడే పెళ్ళి చేసుకోనని పట్టుబట్టి నెగ్గించుకోలేని తెలివి మాలినదాన్ని. క్లాసులో నాకంటే తక్కువ మార్కులొచ్చే సావిత్రి డాక్టరయింది. షకీలా డిఫెన్స్ లాబ్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తూంది. క్లాసు మొత్తానికి ఎప్పుడూ ఫస్టున వచ్చే నేను మాత్రం కుచేలుడి సంతానాన్ని కని ఇలా అఘోరిస్తున్నాను."

"అప్పుడు చిన్నపిల్లవి. అంత ఆలోచించే శక్తి ఎక్కడుంటుందిలేమ్మా?!" గతాన్ని తలచుకుని కుమిలిపోతున్న చెల్లెలికి సర్ది చెప్పబోయాడు రఘు.

"నాకాలోచించే శక్తి లేకపోతే నాకోసం నువ్వు ఆలోచించి పెట్టినప్పుడయినా నేను తెలివి తెచ్చుకోవాలా? పెద్దవాళ్ళే చూచుకుంటార్లే అని నా బ్రతుకును వాళ్ళ చేతుల్లో పెట్టినందుకు నాకు తగిన శాస్తి జరిగింది. నేను తెలివి తెచ్చుకుని కళ్ళు తెరచేసరికి నా బ్రతుకే తెల్లారిపోయిందన్నయ్యా!" హృదయం ద్రవించేలా ఏడవసాగింది స్వరాజ్యం.

"ఊరుకోమ్మా! జరిగిపోయిన దానికేం చేస్తాం చెప్పు?" ఊరడించడానికి ప్రయత్నించాడు రఘు.

"ఆడపిల్లకు చదువెందుకు, పెళ్ళి చేసేద్దామని ఆజ్ఞాపించిన నాయనమ్మ, ఆవిడ మాటకు 'డూడూ బసవన్న' లాగా తలూపిన నాన్న, వంశోద్ధారకుల కోసమని ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకో నివ్వకుండా అడ్డుపడి నాప్రాణం తీసి గంపెడు పిల్లల్ని కనిపించిన మా అత్తగారు ఎవరిదారినవారు దాటుకుపోయారు. రెక్కలు రాని నా పిల్లలు, రెక్కలు విరిగిపోయిన నేను దిక్కులేని పక్షుల్లాగా అలమటిస్తున్నాము. మా ఆయనీ జన్మలో మారరు. చదువు సంధ్యలు, ఆస్థిపాస్తులు లేని నేను ఒంటరిగా యింత మందినెలా కడతేర్చగలనన్నయ్యా?! చావలేక బ్రతకలేక అన్నట్టుగా వుంది నా పరిస్థితి" హృదయ విదారకంగా ఏడుస్తున్న స్వరాజ్యాన్ని ఓదార్చడానికి మాటలు దొరకలేదు రఘుకి. "ఏడవకమ్మా!" ఊరడించబోయాడు రఘు.

"ఏడుపు తప్ప నాకు మిగిలిందేముందన్నయ్యా? తప్పు చేసానన్న భావం నన్ను ప్రతి నిమిషం తినేస్తూంది. ఇంత మందిని కనిపడేయడం ముమ్మాటికీ నేను చేసిన నేరమే. దేశద్రోహాన్ని మించిన ఈ నేరానికి మా అత్తగార్నో లేక మరొకర్నో బాధ్యుల్ని చేసి నా తప్పు లేదనుకోవడం కూడా పొరపాటు... కాని... యిప్పుడు

నడి సముద్రంలోని ఈ నావనెలా గట్టుకు చేర్చాలో తెలియడం లేదన్నయ్యా!" తనను తాను నిందించుకుంటూ, అంతలోనే భోరున విలపిస్తున్న చెల్లెలి దుఃఖం మాటల్లో తీరేది కాదని రఘుకు తెలుసు.

"ధైర్యంగా వుండమ్మా! జరిగిపోయిందాన్ని తలచుకుని ఏడ్చినందు వల్ల ప్రయోజనముండదు కదా!... పిల్లలు ఎదుగుతున్నారు. ఊళ్ళోనే హైస్కూలుంది కాబట్టి పెద్దగా ఖర్చేమీ వుండదు. వాళ్లను చదువుకోనివ్వు. చదువుకు, కట్నాలకు రెంటికీ తూగలేనేమోనని ఆడపిల్లలకప్పుడే పెళ్ళి చేసేయకు. చదువుకుని వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడ గల స్థోమత వచ్చేవరకు మేము చెయ్యగలిగిన సాయం చేస్తాము. యింక పెళ్ళిళ్ళంటావా? చదువు, సంపాదన వుంటే నీకు భారం లేకుండా వాళ్లే వెతుక్కుంటారు తమ భర్తల్ని" కొండంత ధైర్యాన్ని కలిగిస్తూ అన్నగారు చెప్పిన మాటలకు కృతజ్ఞతతో స్వరాజ్యం గుండె బరువెక్కింది. తడికళ్ళతో అన్నగార్ని చూస్తూ అతని చేతులందుకుని కళ్ళదగ్గరుంచుకుంది.

ఇంత పెద్ద మనసుతో అన్నగారు తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడని ఊహించని స్వరాజ్యం అడుగడుగునా రఘు చేసిన సహాయానికి ద్రవించి పోయింది. రఘు అందించిన సహాయాన్ని అందిపుచ్చుకుని స్వరాజ్యం పిల్లలు బ్రతుకులో నిలబడడానికి సాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. పెద్ద కూతురు లత హైస్కూలు టీచరయింది. రెండో కూతురు గీత ఒక ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తూంది. మూడో కూతురు సుధ ఒక స్టార్ హోటల్లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తూంది. నాలుగో అమ్మాయి వసుధ పాలిటెక్నిక్ కాలేజిలో చదువుతూంది. మిగతా ఆడపిల్లలు హైస్కూల్లోను, చివరి వాడు వంశీ ఎలిమెంటరీ స్కూల్లోనూ చదువుతున్నారు. తన పిల్లలు ప్రయోజకులవుతున్నందుకు, ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తూ తనకాసరాగా వుంటున్నందుకు స్వరాజ్యానికి ఒక ప్రక్క సంతోషంగా వుంది. మరోవైపు ఇద్దరు, ముగ్గురు పిల్లల్తో సరిపెట్టుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్ద చదువులు చదవడానికెంత చక్కటి అవకాశాల్ని కల్పిస్తూంది, వారు సుఖంగా బ్రతకడానికెంతగా అమరుస్తూంది చూచి అపరాధ భావంతో క్రుంగిపోయేది.

ఇంతలో పులిమీద పుట్రలా మరో ఆపద వచ్చి పడింది. విపరీతమైన నీరసం, ఆకలి లేకపోవడం, రక్తం లేక పోవడం వల్ల, పనెక్కువ అవడం వల్లేమోనని అశ్రద్ధ చేసింది. దుర్వాసనతో కూడిన ఎరుపు, తెలుపు డిశ్చార్జి మొదలయ్యేసరికి భయపడి డాక్టరు దగ్గర కెళ్ళింది. డాక్టరు గర్భసంచి నుంచి ముక్కతీసి బయాప్సీ

పరీక్షకు పంపింది. వారం రోజుల్లో రిపోర్ట్ వస్తుందని, ఈ సారి హాస్పటల్‌కి వచ్చేప్పుడు ఎవరినైనా దగ్గరివాళ్ళను వెంట బెట్టుకుని రమ్మని చెప్పింది. ఆవిడ ప్రశ్నల వల్ల తనకు మరీ చిన్న వయసులో పెళ్ళవడం మూలాన, చిన్న వయసులో పిల్లలు పుట్టడంవల్ల, కానుపు లెక్కువవడం వల్ల, గర్భాలు పోవడం వల్ల,ఇంటిదగ్గర నాటు మంత్రసానుల్తో పురుడు పోయించుకోవడం వల్ల, తన భర్త జులాయి తిరుగుళ్ల వల్ల ఏదో భయంకరమైన జబ్బు తన శరీరంలో ప్రవేశించిందని అర్థమయింది. డాక్టరు సూటిగా చెప్పకపోయినా తనకు వచ్చిన ఈ మాయదారి జబ్బు కాన్సరే అయుంటుంది. కాన్సర్ వచ్చిన తను మరెంతో కాలం బ్రతకదు.

'కాన్సర్' అన్న ఊహ దగ్గరకు ఆలోచన వచ్చేసరికి స్వరాజ్యం గుండె ఒక్కసారి గుభిల్లుమంది. అప్పటివరకు తను చనిపోతే ఏమిటి నష్టం అన్న నిర్వేదంలో వున్న ఆమె 'అమ్మో! చచ్చిపోతే ఎలా? నా బిడ్డల ఆలన పాలన, చదువు సంధ్యలు, పెళ్లిళ్లు ఎవరు పట్టించుకుంటారు? వాళ్ళఉద్యోగాల గురించి నలుగుర్నీ ఎవరు ప్రాధేయ పడతారు? తన ముఖం చూచి తన బిడ్డల కింత సాయం చేసిన రఘు అన్నయ్య తను పోయాక కూడా వీళ్ళను చూస్తాడా? బ్రతుకులో తనకే సుఖాన్నీ, సంతోషాన్నీ పంచకపోగా అంతులేని దుఃఖాన్ని కలిగించిన వ్యక్తే అయినా అతను తన భర్త, తన పిల్లలకు తండ్రి, తను లేకపోతే అతన్నెవరుచూచుకుంటారు? ' బ్రతకాలనే ప్రగాఢవాంఛ ఆమెను నిలవనివ్వడం లేదు. అనంత జీవజ్వాల ఆమె నరనరాన విద్యుత్తులా జ్వలిస్తూంది. బాధల్ని భరించలేకపోయినప్పుడల్లా, సమస్యల్ని ఎదుర్కోలేక పోయినప్పుడల్లా 'చచ్చిపోతే బావుండు' నని అనుకున్న స్వరాజ్యం ఇప్పుడు మృత్యువు అతి సమీపంలోకి వచ్చేసరికి అన్ని బాధలు. సమస్యలతో కూడిన బ్రతుకును కోరుకుంటూంది.

"నేను చనిపోను. నేను బ్రతకాలి. నేను బ్రతుకుతాను" హిస్టీరికల్‌గా అరుస్తూ కుర్చీలోంచి పైకి లేచింది స్వరాజ్యం.

అప్పటిదాకా ఉరుముతున్న మేఘాలు వర్షించసాగాయి.

- *"యోజన" పక్షపత్రిక, 1993.*